بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُہٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 01.01.2016 (Telugu)

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలను మనము వృధా చేయువారము కాకూడదు. వారు తమ జమాఅత్ కొరకు చేసిన దుఆలకు మనము వారసులము కావలెను. ఈ దుఆతో నేను మీ అందరికి నూతన సం॥ శుభాకంక్షలు తెలుపుచున్నాను. ఈ సం॥ను అల్లాహ్ తఆలా మనకు వ్యక్తిగతంగాను, జమాఅత్ పరంగాను అనన్య శుభములకు కారణము చేయుగాక!**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 01.01.2016 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేడు నూతన సంవత్సర మొదటి రోజు. పవిత్ర దినమైన శుక్రవారముతో ఇది ప్రారంభమగుచున్నది. గత సాంప్రదాయము ప్రకారము మనము క్రొత్త సంవత్సరం ప్రారంభం కాగానే పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటాం. నాకు కూడ నూతన సంవత్సర శుభాకాంక్షల సందేశములు జమాఅత్ సభ్యుల నుండి అందుచున్నవి. మీరు పరస్పరము నూతన సం॥ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు కావచ్చును. పశ్చిమములోని ప్రగతి చెందిన దేశములలో నూతన సం॥ రాత్రి మొత్తం అల్లరి, మద్యపానం, పటాకాలు కాల్చి, ఫైర్ వర్క్స్ అనబడు పుష్ప గుచ్ఛాలతో నూతన సంవత్సరమును ప్రారంభింతురు. ఇప్పుడు ముస్లిం దేశములలో కూడ ఇదే తరహాలో స్వాగతించబడుచున్నది. కాని అహ్మదీయులలో అల్లాహ్ తఆలా కృపానుసారము అనేకులు తమ రాత్రిని ఆరాధనతో ప్రారంభించిరి. లేదా ఉదయం త్వరగా నిద్రలేచి నఫిల్ చదివి నూతన సం॥ను ప్రారంభించిన వారున్నారు. అనేక చోట్ల సామూహిక తహజ్జుద్ నమాజ్ చదువబడెను. ఇవన్ని చేసినను మనము ఈ ముస్లిముల దృష్టిలో మనము ముస్లిమేతరులము. ఈ అల్లరి చేయువారు, డబ్బులను వృధా చేయువారు, అధార్మిక ఆచారాలను చాలా పకడ్బందీగా పాటించువారు ముస్లిములు.!

అల్లాహ్ తఆలా కృపానుసారము మనము ముస్లిములము. మనకెవరి పట్టా అవసరము లేదు. అవును మనము పట్టా పొందగోరినచో అల్లాహ్ తఆలా దృష్టిలో నిజమైన ముస్లిములమనబడి పట్టా పొందుటకు మనము ఆశించుచున్నాము. సంవత్సర మొదటి రోజు మనము వ్యక్తిగతంగా లేదా సామూహికంగా తహజ్జుద్ చదువుట, దాన ధర్మములు ఇచ్చుట లేదా కొంత పుణ్యము చేసి, మరి కొన్ని మాటలు మాట్లాడుట అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు హక్కుదారులుగా చేసినదనుట సరిపోదు. అల్లాహ్ తఆలా తన దాసునితో శాశ్వత పుణ్యములను కోరును. తన దాసుడు ఎల్లప్పుడు తన ఆజ్ఞలను పాటించాలని అల్లాహ్ తఆలా ఆశించును. పుణ్యములను ఆచరించుచు, నమాజ్, తహజ్జుద్‌తో తమ హృదయములలో పవిత్ర విప్లవము పుట్టించవలసిన అవసరమున్నది. అప్పుడు అల్లాహ్ తఆలా రాజీ పడును. ఒక్కటి రెండు రోజులకు మరిమితమయ్యే పుణ్యము వాస్తవానికి పుణ్యము కాదు. అల్లాహ్ తఆలా ప్రీతికి కారణమయ్యే ఎటువంటి కర్మ, పద్ధతులను మనము అవలంభించవలెనో ఆలోచించవలెను. నేటి కాల సవరణ కొరకు పంపబడిన దైవదూత పలు ఉపదేశములను ఇందుకు నేను తీసుకొన్నాను. ఇవి వారు వివిధ సందర్భములలో తమ జమాఅత్‌నకు చేసినవి. తద్వారా మనము స్థిరత్వముతో, వరుసగా అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుటకు కృషి చేయగలము. ఈ విషయములు సంవత్సర మొదటి రోజునే కాదు

సంవత్సరం 12 నెలలు, 365 రోజులను శుభప్రదము చేయును. మనము అల్లాహ్ తఆలా అనుగ్రహములను పొందువారమగుదుము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి. ఇప్పుడు ప్రపంచ స్థితిని చూడుము. నా మరణము, జీవించుట సర్వము అల్లాహ్ తఆలా కొరకేనని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తన ఆచరణతో చూపినారు. కాని ఇప్పటి ముస్లిములున్నారు. నీవు ముస్లిమువేనా అని అన్నచో అల్‌హందులిల్లాహ్ అందురు. ఎవరి వాఖ్యమో వారి జీవిత ఉద్దేశము దేవుని కొరకైతే ఇతడు ప్రపంచము కొరకు జీవించును. (لا الہ الا اللہ **లా ఇలాహ ఇల్లల్లాహ్** అందురు కాని అల్లాహ్ బదులు ప్రపంచము కొరకు జీవించును) తుది శ్వాస వరకు ప్రపంచము కొరకే మరణించును. మరణము వచ్చినను ప్రపంచమే ఉద్ధేశము, ఇష్టముండును. కనుక నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరిస్తున్నానని ఎలా అనగలడు. ఇది చాలా గమనించదగ్గ విషయము. సాధారణమని భావించకుము. ముస్లిం అగుట సులభము కాదు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం విధేయత, ఇస్లాం ఉదాహరణను తమలో కల్పించుకోనంత వరకు తృప్తిపడకుము. ....

అల్లాహ్ తఆలా ప్రియుడగుట మానవుని జీవిత అసలు ఉద్దేశము కావలెనను విషయమును సరిగ్గా అర్థము చేసుకోవలసిన అవసరమున్నది. ఎందుకనగా అల్లాహ్ తఆలా ప్రియునిగా కానంత వరకు, దైవ ప్రేమ లభించనంత వరకు సఫల జీవితము గడపలేరు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన విధేయత, అనుసరణ లేనిదే ఇది సాధ్యము కాదు. ఇస్లాం ఏమిటో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరించి చూపినారు. మీరు దైవ ప్రియులుగా మారుటకు మీలో ఆ ఇస్లాంను పుట్టించుకొనుము.

ప్రాపంచిక వసతులను ఇస్లాం తిరస్కరించదు. కాని ప్రపంచములో యుంటూ ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత ఇవ్వవలెనని ఆదేశించును. దీని గురించి సయ్యద్నా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. బ్రహ్మచార జీవితమును ఇస్లాం ఖండించెను. ఇది అధైర్యుల పని. విశ్వాసుని సంబంధములు ప్రపంచముతో ఎంత విస్తృతంగా యుండునో అవి అతని గొప్ప దశలకు కారణమగును. ఎందుకనగా ముఖ్య లక్ష్యము ధర్మమే యుండును. ప్రపంచము, అతని ధనము, గౌరవము ధర్మమునకు సేవకులుగా యుండును. మేలు, విశిష్టత లభించు పద్ధతిని అవలంభించుము. మరో వ్యక్తిని బాధించే విషయమును అవలంభించకుము. స్వపక్షములో సిగ్గు పడేందుకు కారణము కాకూడదు. ఇటువంటి ప్రపంచము మంచి పరలోకమునకు కారణమగును.

కనుక నా మిత్రుల దృష్టిలో అనగా అహ్మదీయుల దృష్టిలో మానవుడు నగదు, ధనము, స్త్రీ, కుమారుని ప్రేమ ఉత్సాహము, మత్తులో పిచ్చివాడై దేవుని అతని మధ్య తెర ఏర్పడకూడదను విషయము తెలిసియుండవలెను. అనగా అంతరము ఏర్పడకూడదు. అల్లాహ్ తఆలాతో సంబంధము అంతము కాకూడదు. మరల వారిట్లనిరి. నా హృదయములో ఈ ఆలోచన కలిగెను. الحمد للہ رب العالمین۔ الرحمن الرحیم۔ مالک یوم الدین۔ తో మానవుడు తనలో ఈ లక్షణములను కల్పించుకోవలెనని నిరూపితమగును. అనగా ఆ సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములు. అనగా ప్రతి ప్రపంచములో, ఇంద్రియములో, పేరుకొనిన రక్త ప్రపంచములో అనగా ప్రతి ప్రపంచములో రహ్మాన్, రహీమ్, మాలికి యౌమిద్దీన్. 'ఇయ్యాక నాబుదు' అన్నప్పుడు ఈ ఆరాధనలో అదే రుబూబియ్యత్, రహ్మానియ్యత్, రహీమియ్యత్, మాలికియ్యత్ లక్షణముల ఛాయను మానవుడు తనలో కల్పించుకోవలెను. (అల్లాహ్ తఆలా ఈ లక్షణములను మానవుడు తనలో కూడ కల్పించుకోవలెను) تخلقوا با خلاق اللہ (తఖల్లఖూ బిఅఖ్లాఖిల్లాహ్) అనగా అల్లాహ్ తఆలా రంగులో మారిపోవడమే దాసుడైన మానవుని విశిష్టత. ..... ఈ దశకు చేరనంత వరకు అలసిపోకూడదు.

మరణమును దృష్టియందుంచుకొనుటయే అనుగ్రహము. ప్రపంచము, దానిలోని వస్తువులు ప్రియమైనవై యుండకూడదు. అవి ఈ తుది ఘడియలో విడిపోవుచున్నప్పుడు బాధలకు కారణము కాకూడదు. ఇది గుర్తున్నప్పుడు మానవుడు పుణ్యములను చేయుటకు కృషి చేయును. అనవసర కార్యములలో డబ్బును వృధా చేయడు, సమయమును వృధా చేయడు, అక్రమ కోరికలను తీర్చుకొనుటకు ఈ వస్తువులను వృధా చేయడు.

పవిత్ర మార్పు సృష్టించుకొనుట గురించి వారిట్లనిరి. నిర్భయముగా యుండకుము. ఇస్తిఘ్ఫార్, దుఆలలో

నిమగ్నమై యుండుము. ఒక పవిత్ర మార్పు సృష్టించుకొనుము. ఇప్పుడిక ఆ నిర్లక్ష్య సమయము లేదు. నీ ఆయువు ఎక్కువ యున్నదని మానవునికి మనసు అసత్య తృప్తి కలిగించును. మరణమును సమీపములో ఊహించుకొనుము. దేవుని ఉనికి సత్యమే. అన్యాయముగా దేవుని హక్కులను మరొకరికి ఇచ్చినవారు అవమాన మరణము మరణింతురు. .....పవిత్ర మార్పు, పరలోక చింతతో నిష్టాపరత ఏర్పడును. నిష్టాపరతయే మానవున్ని పరలోకములో సఫలము చేయును. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నిష్టాపరునిపై దేవుని ఒక కాంతి పడును. అతడు దేవుని నీడలో యుండును. కాని స్వచ్ఛమైన నిష్టాపరత కావలెను. అందులో షైతాన్ కల్పితము వుండకూడదు. అసలు నిష్టాపరతయే అను విషయమును గుర్తుంచుకొనుము. కనుక ఒకరికి దైవవాణి అందినది, మరొకరికి సత్యస్వప్నము, నిజమైన స్వప్నములు వచ్చినవని మీరు దైవవాణీలు, సత్యస్వప్నముల వెనుక పడకుము. ఎవరికి ఏమి వచ్చుచున్నవో చూడకుము. నిజమైన స్వప్నములు వచ్చుచున్నవా లేదా అని చూడకుము. నిష్టాపరత యున్నదా లేదా అని చూడుము. నిష్టాపరుని దైవవాణీలు కూడ నిజమైనవే అగును. నిష్టాపరత లేనిచో దైవవాణీలు కూడ నమ్మదగినవి కావు.

కనుక నిష్టాపరత పరీక్షలో ఉత్తీర్ణులగుటకు ప్రతి కష్టమును భరించుటకు సిద్ధమగుము. నిష్టాపరత కూడ ఒక పరీక్షయే. ఇందుకు కూడ కష్టించవలెను. మానవుడు ఈ దారిలో అడుగిడినప్పుడు షైతాన్ పెద్ద పెద్ద దాడులు చేయును. కాని ఒక దశకు చేరుకొని షైతాన్ ఆగిపోవును. మానవుని ఇహలోక జీవితముపై మరణము వచ్చి, దేవుని నీడన చేరినప్పటి సమయమది. అప్పుడుతడు దైవరూపం, దేవుని ఉత్తరాధికారి అగును. మానవుడు తమ సర్వ శక్తులను దేవుని వైపు మల్లించుటయే మన బోధన సంక్షిప్త సారాంశము.

నిష్టాపరత పేరున మనకు ఉపదేశమందించుచు వారిట్లనిరి. నిష్టాపరులకు గల నిబంధన ఏమనగా వారు తమ జీవితము బీద, సాధారణ స్థితిలో గడపవలెను. ఇది నిష్టాపరతలోని ఒక శాఖ. దీని ద్వారా మనము అక్రమ కోపముతో పోటీ పడవలెను. అనవసరముగా మనకు కోపము వచ్చినచో దానిని నిష్టాపరతతో ఎదుర్కోవలెను. పెద్ద పెద్ద విజ్ఞానులు, సత్యవంతులకు అంతిమ, కఠిన దశ కోపము నుండి దూరముండుటయే. కొందరు పెద్దలతో ఎంతో మర్యాదగా భేటి అగుదురు. (పెద్ద వ్యక్తి అయినచో, ధనికుడైనచో చాలా మర్యాదతో, గౌరవముగా వ్యవహరింతురు) కాని నిరుపేద మాటను గౌరవముగా వినినవాడే పెద్ద. (ఒక నిరుపేద, బీద వ్యక్తి మాటను విని, చాలా శ్రద్ధతో వినవలెను) అతన్ని ప్రోత్సహించవలెను, అతని మాటను గౌరవించవలెను, అతన్ని బాధించే విధంగా మాట్లాడకూడదు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. ولا تنابزوا بالالقاب بئس الاسم الفسوق بعد الايمان ومن لم يتب فاولئک هم الظلمون. (అల్‌హుజరాత్: 12) అనగా ఒకరు మరొకరి నామమును చెరచుచు పిలవారదు. విశ్వాసము తరువాత అవిధేయత కళంకము తగలుట దుష్టత్వము. పశ్చత్తపులు కాని వారే అన్యాయులు. إِنَّ أَكْرَمَكُمْ عِندَ اللَّهِ أَتْقَاكُمْ إِنَّ اللَّهَ عَلِيمٌ خَبِيرٌ అనగా నిస్సందేహంగా అల్లాహ్ దృష్టిలో మీలో నుండి అందరికంటే ఎక్కువ నిష్టాపరుడే అందరికంటే ఎక్కువ గౌరవనీయుడు, నిశ్చయముగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సదా జాగరూకుడు.

మరో చోట వారిట్లనిరి. ఇహ, పరలోక విజయము మీకు లభించవలెనని మీరు కోరినచో ప్రజల హృదయములను జయించి, పవిత్రతను అవలంభించుము. వివేకముతో పని తీసుకొనుము. దైవ శాసన మార్గదర్శనమును అనుసరించుము. స్వయముగా తమను తీర్చిదిద్దుకొనుము. తమ గొప్ప ప్రవర్తనల ఉదాహరణను చూపుము. అప్పుడు విజయులు కావచ్చును.

చెప్పే ముందు ఆచరించుమను విషయమును సూచించు వారిట్లనిరి. ఇటువంటి వారనగా చెప్పేముందు స్వయముగా ఆచరించినచో పవిత్ర ఖుర్‌ఆన్‌లో لم تقولون ما لا تفعلون అనవలసిన అవసరమేముండెను. స్వయముగా చెప్పి ఆచరించనివారు ప్రపంచములో గతములో యుండిరి, ఇప్పుడున్నారు, ఇకముందు యుందురని ఈ సూక్తి తెలుపుచున్నది. పవిత్ర ఖుర్‌ఆన్ ఆదేశములను ఆచరించదలచినచో ఇటు వైపు కూడ శ్రద్ధ వహించుము. ఈ

ఉపదేశమును ప్రత్యేకముగా మనము మనలను పరిశీలించుకొంటూ ప్రాథమికంగా ప్రతి పదవిదారుడు గుర్తుంచుకోవలెను. తమలో మార్పు కలిగించుకోవాలని ఇతరులతో ఆశింతురు, ఉపదేశములు చేయుదురు, కాని తమ స్థితిలో ఇటువంటి పరిస్థితి ఏర్పడినచో పూర్తి విరుద్ధముగా వ్యవహరింతురు. లేదా ఇందులో సాకులు వెతుకుతురు. అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ఆదేశములకు ప్రాధాన్యత ఇవ్వరు. ఇటువంటి అనేక సమస్యలు నా ముందుకు వచ్చుచుండును. మాట, ఆచరణ ఒకే విధముగా యుండవలెనని తెలుపుచు మరల వారిట్లనిరి. మానవుని సంభాషణ సహృదయముగా యుండనిచో, ఆచరణ శక్తి అతనిలో యుండనిచో అది ప్రభావితము కాదని మీరు నా మాటను మంచిగా గుర్తుంచుకొనుము. మరల పరస్పర సోదరభావము, ఐక్యత, ఆప్యాయత గురించి వారిట్లనిరి. జమాఅత్‌లో పరస్పరము ఐక్యత, ఆప్యాయత గురించి నేను అనేక సార్లు చెప్పినాను. మీరు పరస్పరము ఐక్యత, ఏకముగా యుండుము. మీరు సంఘటితముగా యుండగలరు లేనిచో విభేదము ఏర్పడునని అల్లాహ్ తఆలా ముస్లిములకు బోధించెను. పరస్పరము ఐక్యత ఏర్పడుటకే నమాజ్‌లో ఒకరు మరొకరు కలిసి నిలబడగలరని ఆదేశము గలదు. తద్వారా విద్యుత్తు శక్తి వలె ఒకరి మంచితనము మరొకరిలో ప్రవహించును. విభేదముండి, ఐక్యత లేనిచో ఏమియును సాధించలేరు. మరల వారిట్లనిరి. నా ఉనికితో ఇన్షాఅల్లాహ్ ఒక నిజమైన జమాఅత్ ఏర్పడును. లోభితనము, గర్వము, అహంకారము, భావములే పరస్పర శత్రుత్వమునకు కారణము. ఎంతో విచార వదనంతో వారిట్లనిరి. లోభితనము, గర్వము, అహంకారము, తమ భావములను అదుపులో పెట్టుకొనని, పరస్పరము ఆప్యాయత, సోదరభావముతో యుండలేని ప్రజలను నేను జమాఅత్ నుండి దూరము చేయుదునని వారనిరి. మంచి ఉదాహరణ చూపనంత వరకు ఇటువంటి వారు కొన్ని రోజుల అతిథులని గుర్తుంచుకొనుము. నేను మరొకరి వలన నాపై విమర్శను తీసుకోదలచలేదు. నా జమాఅత్‌లో యుండి నా అభీష్టము మేరకు యుండనివారు ఎండిపోయిన శాఖ అని గుర్తుంచుకోవలెను. దానిని తోటమాలి కొట్టివేయక మరేమి చేయును. ఎండిన శాఖ పచ్చని శాఖలతో యుండి నీరు త్రాగును కాని దానిని పచ్చగా చేయక ప్రక్క శాఖను కూడ వృధా చేయును.

మరల దుఆల ఆమోద నిబంధనల గురించి వారిట్లనిరి. ఒకరి మాటను పూర్తి శ్రద్ధతో వినవలెను. దుఆ ఆమోదము కొరకు కొన్ని నిబంధనలు యున్నవి. వాటిలో కొన్ని దుఆ చేయువారి గురించి యుండును. కొన్ని దుఆ చేయించువారి గురించి యుండును. దుఆ చేయించుటకు అతడు అల్లాహ్ తఆలా భయము, భక్తి కలిగియుండవలెను. వైభవోపేతుడైన ఆ దైవ ఉనికితో సదా భయపడుచుండవలెను. సంధి, దైవ లక్షణములు తమలో కల్పించుకోవలెను. నిష్టాపరత, సత్యముతో అల్లాహ్ తఆలాను సంతోషపెట్టవలెను. ఇటువంటి స్థితిలో దుఆ కొరకు ఆమోద ద్వారము తెరుచుకొనును. దుఆ ఆమోదమునకు నిష్టాపరత అనివార్య నిబంధన. నిర్లక్ష్యముగా దుఆ ఆమోదమును ఆశించిన వ్యక్తి అవివేకి, బుద్ధిహీనుడు కాడా? కనుక మన జమాఅత్‌లో సాధ్యమైనంత వరకు నిష్టాపరత మార్గములలో అడుగిడుట తప్పనిసరి. దుఆ ఆమోద రుచిని పొందవలెను, విశ్వాసమును పెంచుకోవలెను.

అల్లాహ్ తఆలా మనందరి జీవితములను వారి అలైహిస్సలాం అభీష్టము మేరకు మార్చుకొనుటకు అనుగ్రహించుగాక! అనుక్షణం మన అడుగులు పుణ్యముల వైపు పడుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దుఆలను మనము వృధా చేయువారము కాకూడదు. వారు తమ జమాఅత్ కొరకు చేసిన దుఆలకు మనము వారసులము కావలెను. ఈ దుఆతో నేను మీ అందరికి నూతన సం॥ శుభాకంక్షలు తెలుపుచున్నాను. ఈ సం॥ను అల్లాహ్ తఆలా మనకు వ్యక్తిగతంగాను, జమాఅత్ పరంగాను అనన్య శుభములకు కారణము చేయుగాక! ❋❋❋

BOOK POST (PRINTED MATTER)

To,
..........................................................................
..........................................................................
..........................................................................